13న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కరాటే పోటీలు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 10: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి కరాటే పోటీలు ఈనెల 13న దోమకొండ మండలంలోని ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. 17 సంవత్సరాల లోపు బాలబాలికలకు నిర్వహించబడునని తెలిపారు. క్రీడాకారులు తమ వెంట ఒరిజినల్ బోనాఫైడ్, ఒరిజినల్ ఆధార్‌కార్డు తీసుకుని రావాలని తెలిపారు. ఈ కరాటే పోటీల్లోని విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయబడునని తెలిపారు. క్రీడాకారులు తమ క్రీడా దుస్తులు, ఇతర సామగ్రిని తీసుకుని రావాలని తెలిపారు.



నరికివేతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

హాజీపూర్ తండా అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

అటవీ భూములు.. అన్యాక్రాంతం

- జిల్లాలో యథేచ్ఛగా అటవీ భూముల ఆక్రమణలు
- ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలో అటవీ భూముల కబ్జా
- సుమారు 12 ఎకరాల్లో కబ్జాకు యత్నం
- మొద్దు నిద్రలో అటవీశాఖ అధికారులు
- ఓ అటవీ శాఖ అధికారి అండదండలతోనే అని ఆరోపణలు
- కనుమరుగవుతున్న అడవులు



ఎల్లారెడ్డి, సెప్టెంబరు 10 : జిల్లాలో అటవీ భూములు ఆక్రమణదారులు, కబ్జాదారులు, స్మగ్లర్ల గొడ్డలి వేటుకు అడవులు కనుమరుగవుతున్నాయి. భవిష్యత్తు తరాలకు అడవులను మిగిల్చకుండా భూ ఆక్రమణదారులు అడవులను యథేచ్ఛగా కబ్జా చేస్తూ అటవీ భూములను కొల్లగొడుతున్నారు. దీంతో జిల్లాలో రోజురోజుకూ అడవులు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 25 శాతం మాత్రమే అడవులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 26 వేల ఎకరాలకుపైగా అటవీ భూములు కబ్జా అయినట్లు ఆ శాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసింది. ఆక్రమణదారుల కన్ను అటవీ భూములపై పడినట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా భావించి అటవీ భూములను ఆక్రమించేందుకు ఆక్రమణదారులు ప్రయత్నాలు చేపట్టడంతో జిల్లాలో జరుగుతున్న సంఘటనలే నిదర్శనం. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా శివారులో 12 ఎకరాలకుపైగా అటవీ భూములను కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిని అధికారులు కూడా పరిశీలించారు.

జిల్లాలో 2.5 లక్షల ఎకరాల్లో అటవీ ప్రాంతం

జిల్లాలో మొత్తం 2,05,570 ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. జిల్లాలో ఎల్లారెడ్డి, గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట, బిచ్కుంద, మద్నూర్, బాన్సువాడ, సదాశివనగర్, మాచారెడ్డి తదితర మండలాల్లో అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో దట్టమైన అడవులతో పాటు విలువైన అటవీ సంపద ఉంది. ఇప్పటికే పోడు భూముల పేరిట వేలాది ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురి కాగా కొందరు కలప స్మగ్లర్ల గొడ్డలి వేటితో అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. మరికొందరు మైనింగ్ మాఫియా గుట్టల్లో తవ్వకాలు చేపట్టడంతో అటవీ సంపద తగ్గిపోతూ వచ్చింది. ఇలా జిల్లాలో అడవులు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం 25 శాతం మాత్రమే అడవులు ఉన్నాయని వాటిని కాపాడుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే అటవీ హక్కుల చట్టాన్ని కాపాడేందుకు అటవీ హక్కుల పరిరక్షణ ఏర్పాటు చేసినా అటవీ భూముల కబ్జాలు మాత్రం ఆగడం లేదు.

హాజీపూర్ తండాలో అడవిలో చెట్లను నరికి భూముల కబ్జాకు యత్నం

ఎల్లారెడ్డి మండలంలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఉన్న హాజీపూర్ తండా అటవీ ప్రాంతంలో సోమవారం రాత్రి సుమారు 12 ఎకరాలకు పైగా అటవీ భూములను కబ్జా చేసేందుకు ఆక్రమణదారులు చెట్లను నరికి వేస్తున్నారు. కబ్జాదారుల గొడ్డలి వేటుకు అటవీ ప్రాంతం కనుమరుగవుతోంది. అటవీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అటవీశాఖ అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. గత వారం రోజులుగా కరుస్తున్న భారీ వర్షాలకు ఇదే అదునుగా భావించి వర్షాలను సైతం లెక్క చేయకుండా కబ్జాదారులు వృక్షాలను నరికి వేస్తున్నారు. పోడు భూముల సాకుతో కబ్జాదారులు సుమారు 12 ఎకరాలకుపైగా అటవీ భూముల్లో చెట్లను నరికి వేశారు. ఈ భూమిని కబ్జా చేసేందుకు కబ్జాదారులు నిర్మిస్తున్నారని స్థానికులు తెలిపారు. అటవీ భూమిలో భారీ వృక్షాలను నరికి వేశారు. ఇలా సుమారు 600కుపైగా అటవీ చెట్లను నరికి వేసి భూమిని చదును చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

కొందరు అటవీ సిబ్బంది అధికారుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు

జిల్లాలోనూ పలు అటవీ ప్రాంతాల గ్రామాలు తండాల శివారులో గల అటవీ భూములను కబ్జా చేసేందుకు కబ్జాదారులకు ఆ శాఖలోని కొందరు అధికారులు సిబ్బంది సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అటవీ శాఖలోని మరికొందరు అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణదారులు యథేచ్ఛగా అటవీ భూమిని అప్పనంగా కాజేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా శివారులో స్థానికంగా ఉండే కబ్జాదారులకు ఆ పరిధిలోని అటవీ శాఖలోని కొందరు సిబ్బంది అధికారుల అండదండలతో అడవుల్లోని చెట్లను నరికి భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానిక తండావాసుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. గతంలోనూ ఎల్లారెడ్డి మండల పరిధిలోని లక్ష్మాపూర్ తండా పరిధిలో అటవీ చెట్లను నరికి భూమిని కబ్జా చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానిక తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

మొద్దు నిద్రలో అటవీ శాఖ అధికారులు


డివిజన్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఆక్రమణదారులు యథేచ్ఛగా అటవీ చెట్లను నరికివేస్తూ భూములను కబ్జా చేస్తున్నా అధికారులు సిబ్బంది నిద్రమత్తులో ఉన్నారు. గతంలో తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలో కూడా సుమారు 10 ఎకరాలకుపైగా అడవిలో ఉన్న చెట్లను నరికి కబ్జా చేసేందుకు యత్నించారు. కానీ స్థానిక అటవీశాఖ అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది పర్యవేక్షించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

పోడు భూముల పేరిట ఆక్రమణలు

గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే పోడు భూముల చాటున ఆక్రమణదారులు అటవీ భూములను మరింత ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అటవీ విస్తరించి ఉన్న ప్రాంతాలపై కొందరు ఆక్రమణదారులు కబ్జాదారులు కన్ను పడింది. ముఖ్యంగా తండాల సరిహద్దుల్లో అటవీ భూములు ఎక్కువగా కబ్జాకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ఎలాగో ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తున్నందున ఇదే అదునుగా భావించి అటవీ భూముల కబ్జాల్లోకి వెళుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2.5లక్షల ఎకరాల్లో అటవీ భూములు ఉన్నాయి. ఇందులో కొంత భూమి కొన్నికొన్ని వేల ఎకరాల భూములు వివాదంలో ఉన్నట్లు అటవీ శాఖ రికార్డులు చెబుతున్నాయి. ఇలా పంటల సాగు చాటున పోడు భూముల పేరిట అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కొనసాగుతున్న.. సాగర్ నీటి విడుదల!

ప్రాజెక్టుపై పర్యాటకుల సందడి



నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

నిజాంసాగర్, సెప్టెంబరు 10: జిల్లాలోని ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తూనే ఉంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి 6 వేల క్యూసెక్కుల నీటిని వీఆర్ నెంబర్ ఐదులోని ఒక్క గేటు ఎత్తి మంజీరా నదిలోనికి విడుదల చేస్తున్నారు. 1405 అడుగులకు గాను 1404.96 నీటి సామర్థ్యాన్ని నిల్వ చేస్తున్నారు. నిజాంసాగర్‌లో 17.744 నిల్వ ఉంది.

ప్రాజెక్టుపైన పర్యాటకుల సందడి

నిజాంసాగర్ ప్రాజెక్టుపైన పర్యాటకులు సందడి చేస్తున్నారు. వరద గేట్ల కట్టపైన పర్యాటకులు, సెల్ఫీలు దిగుతూ కేరింతలు వేస్తూ నిజాంసాగర్ నీటిని ఆస్వాదిస్తున్నారు. ప్రాజెక్టు రహదారి వెంట పర్యాటకులు వస్తూ సాగర్ నీటిని ఆస్వాదిస్తూ గార్డెన్‌లో సేదతీరుతున్నారు. పర్యాటకుల రద్దీని పోలీసులు చర్యలు చేపడుతునే ఉన్నారు. వాహనాల నిలుపుకునేందుకు పోలీసులు ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. కాలినడకన వెళ్లి పర్యాటకులు గార్డెన్‌లో సేదతీరేందుకు అనుమతినిచ్చారు. గార్డెన్‌లో పర్యాటకులు, సహపంక్తి చేస్తూ ఆనందంలో మునిగిపోయారు. బోటు షికారు లేక పోవడంతో నిరాశకు అవుతూ ఉన్నారు. పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతూ ఉన్నా రు. గుల్‌గస్తీ గార్డెన్‌లో సౌకర్యం కోసం టాయి లెట్స్ ఏర్పాటు చేసినా ఫలితం శూన్యం. పరిసర ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులే అల్పాహారం, స్టాళ్ల ఏర్పాటు చేసినప్ప టికీ వ్యక్తులు అధిక ధరలకు విక్రయిస్తున్న ఆరోపణలు వస్తూ ఉన్నాయి.



సందడి చేస్తున్న పర్యాటకులు



ప్రాజెక్టుకు వెళ్లే దారిలో వెలిసిన దుకాణాలు

భూమి కోసం పోరాటం చేసిన వీర వనిత చాకలి ఐలమ్మ



కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ వెంకటయ్య

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 10: భూమి కోసం, భుక్తి కోసం రజాకార్లను, భూస్వాములను ఎదిరించి పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మలతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనాటి భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి తెలంగాణ సాయుధ పోరాటానికి ఆజ్యం పోసిన వీర వనిత చాకలి ఐలమ్మ అని తనను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా బెదురకుండా మొక్కవోని ధైర్యంతో రోకలి బండ చేతబూని గుండాలను తరిమికొట్టిందని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడీ దయానంద్, వసతి గృహ సంక్షేమ అధికారులు చక్రధర్, సతీష్, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీనెల సివిల్ రైట్స్‌డే నిర్వహించాలి

జిల్లాలోని అన్ని గ్రామాల్లో సివిల్‌రైట్స్‌డే ప్రతీనెల నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీకమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో లాండ్ సర్వీసెస్,అట్రాసిటి పైన కమిటీ సభ్యులు, జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ సింధూశర్మతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టంపై అవగాహన కల్పించాలని ప్రతి నెల చివరి రోజున సివిల్‌రైట్స్‌డే తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీలపై జరిగిన దాడుల కేసులపై, భూసంబంధ కేసులు, సర్వీస్‌మాటర్స్‌లకు సంబంధించిన వాటిపై నెల లోపు పూర్తిచేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కమీషనర్ పర్యటిస్తుందని తెలిపారు. జిల్లా స్థాయి సమావేశ వివరాలను కమీషన్‌కు తెలియపరచాలని పేర్కొన్నారు. కేసుల పూర్వపరాలను పోలీసు అధికారులు పరిశీలించాలని, పోలీసుస్టేషన్‌కు వచ్చే అర్జిదారులను గౌరవించి సమస్యలను తెలుసుకోవాలని తెలిపారు. గురుకులాలను అధికారులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించాలని తెలిపారు. షెడ్యూల్ కులాలు,షెడ్యూల్ తెగలకు సంబంధించిన వసతి గృహాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదైన వారికి నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తున్నామని తెలిపారు. భూములకు సంబంధించిన కేసులు పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఆయా పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను ఎస్పీ వివరించారు.ఈ సమావేశంలో కమీషన్ సభ్యురాలు నీలాభాయి, రాంబాబునాయక్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, ఆర్డీఓలు రంగనాథరావు, ప్రభాకర్, డీఎస్పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాశరథి అవార్డు గ్రహీత ఆయాచితం ఇకలేరు

హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన నటేశ్వర శర్మ

కామారెడ్డి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి రచయిత, దాశరథి అవార్డు గ్రహీత డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మ మంగళవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత ఆరు నెలలుగా నటేశ్వరశర్మ శ్వాసకోశ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. ఆయన అంత్యక్రియలు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి స్వగృహం సమీపంలోనే బుధవారం కుటుంబ సభ్యులు నిర్వహించనున్నట్లు తెలిసింది. గొప్పగొప్ప పండితులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్న ఆయాచితం నటేశ్వరశర్మ మృతి చెందడంతో కవి, రచయిత లోకానికే కాకుండా కామారెడ్డి జిల్లా వాసులకు తీరని లోటు. ప్రముఖ రచయిత కవిని జిల్లావాసులు కోల్పోయారని రచయితల సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ప్రతిష్మాత్మకమైన పురస్కారం దశరథితో పాటు ఎన్నో అవార్డులు, పురస్కారాలను తన కవితలు, రచనలతో సొంతం చేసుకున్నారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మను దాశరథి పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రం నటేశ్వరశర్మ స్వస్థలం. 1956 జూలై 17న జయలక్ష్మీదేవి - ఆనంద రాజశర్మ దంపతులకు జన్మించారు. నటేశ్వరశర్మకు భార్య అరుణకుమారి, కుమార్తెలు కౌముది, జాహ్నవి, యామినీలు ఉన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఓరియంటల్ పాఠశాలలో సంస్కృత ఉపాధ్యాయుడిగా, ప్రధాన ఉపాధ్యాయుడిగా, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రాచ్యభాష విభాగానికి డీన్‌గా పని చేశారు. 2014లో ఉద్యోగ విరమణ పొందారు.



ఆయాచితం నటేశ్వరశర్మ

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఖిల్లా, సెప్టెంబరు 10: నగరంలోని 3వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుబ్బా ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురి నుంచి 8,430 రూపాయలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎవరైనా పేకాట ఆడుతున్నట్లయితే సమాచారం అందించాలని కోరారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన జిల్లా నేతలు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 10: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను నగరానికి చెందిన మైనార్టీ నేత జావెద్ అక్రమ్‌తో పాటు ఇతర నేతలు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వారిలో ధన్‌రాజ్, ఇతర నేతలు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో మొబైల్‌షాప్ యజమాని!

ఖిల్లా, సెప్టెంబరు 10: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతానికి చెందిన ఓ మొబైల్ షాప్ యజమానిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మంగళవారం నగరంలోని ఓ మొబైల్‌షాప్ ఓనర్‌ను సైబర్ క్రైం కేసులో ఛత్తీస్‌గడ్ పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. మొబైల్‌షాప్ యజమాని అకౌంట్‌లో వచ్చిన నగదును ఎలా వచ్చిందని ఆరా తీస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన పోలీసులు సాయంత్రం నుంచి ఆ మొబైల్‌షాప్ యజమానిని విచారిస్తున్నా.. ఈ విషయం బయటకు తెలియరాలేదు. ఈ విషయమై సంబంధిత పోలీసులను ప్రశ్నించగా తమ పరిధిలో లేదని చెప్పడం గమనార్హం. అయితే సైబర్ క్రైంకు సంబంధం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఆ దిశగా మొబైల్ షాప్ యజమానిని విచారిస్తున్నట్లు సమాచారం.

బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్స్‌ను మళ్లీ నిర్వహించాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 10: జీజీ కళాశాలలో గత సంవత్సరం 5, 6 సెమిస్టర్‌లు కలిగిన విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ను మళ్లీ నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ భారత్ రాజును కలిశారు. ఆయనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రాక్టికల్స్ సబ్మిట్ చేయకపోవడం వల్ల విద్యార్థులు ఫెయిల్ అయినట్లు మెమోలో వస్తుందన్నారు. కంట్రోలర్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, కార్యదర్శి ప్రిన్స్, దేవిక, వంశీ, మనోజ్, నిఖిల్ ఉన్నారు.

తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిన చాకలి ఐలమ్మ

సిరికొండ, సెప్టెంబరు 10: తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిన మహిళ చాకలి ఐలమ్మ అని సత్యశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సిరికొండలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనలో భూస్వాములు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాడుతూ తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన తొలి వీరనారీ అని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం ఎనలేని పోరాటం చేసిన మహనీయురాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు లేని రైతుల వివరాలు సేకరించాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్



వర్నిలో వివరాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వర్ని,సెప్టెంబర్ 10: పంట రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని రైతుల వివరాల సర్వేలో నిర్ధారణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ సూచించారు. మంగళవారం రైతు వేదికలో వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడారు. వర్ని మండలంలో 1337మంది రైతులకు గాను 764మంది రైతుల సర్వే పూర్తయిందని మిగిలిన రైతుల వివరాల సర్వేను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. జిల్లాలో రుణమాఫీ కాని రైతుల వివరాలను అన్ని మండలాల నుంచి సేకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పూర్తిస్థాయిలో అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ సిబ్బంది పని చేస్తున్నట్లు చెప్పారు.అనంతరం జాకోర, జలాల్‌పూర్‌తో పాటు వర్ని మండల కేంద్రంలో ఎరువుల గోదాంలను పరిశీలించారు. వ్యవసాయ అధికారి వెంట వర్ని వ్యవసాయ అధికారి దివ్య, ఏఈవోలు అరుణ్, సుధీర్, ప్రవళిక, సీఈఓ రామకృష్ణయ్యలు ఉన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా మోజీరాం

సిరికొండ సెప్టెంబరు 10:పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా కొండాపూర్ పాఠశాలకు చెందిన మోజీరాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మంగళవారం సిరికొండలో జరిగిన ఎన్నికల సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు అధ్యక్షుడిగా మోజీరాం, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా శంకర్,కార్యదర్శిగా సంతోష్, మహిళ ఉపాధ్యక్షురాలిగా స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడి మోహన్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ గోపిడి రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు లక్ష్మన్ తదితరులు హాజరయ్యారు.

ఇంట్లో కింద పడి వృద్ధురాలి మృతి

కోటగిరి,సెప్టెంబరు 10: పొతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో రాజబాయి(63)అనే వృద్ధురాలు ఇంట్లో కిందపడి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. రాజబాయి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. మంగళవారం ఉదయం 5గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాత ఇంటిలోకి వెళ్లగా కిందపడి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కూతురు రమాబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధర్పల్లిలో పోలింగ్ కేంద్రం పరిశీలన

ధర్పల్లి, సెప్టెంబరు 10: మండలంలో గల 35 పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలను ఈ సందర్భంగా స్థానిక గ్రామ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను గ్రామాల వారిగా సిద్ధం చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే గత ఎంపీ ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితాను విభజించి గ్రామ పంచాయతీల వారిగా జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో 8, 10, 12 వార్డులను జనాభా ప్రాతిపదికన ఏర్పాటు చేయనున్నామన్నారు.

తహసీల్దార్ ఎదుట రౌడీ షీటర్ బైండోవర్

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు10: మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన రౌడీ షీటర్ నర్ర నవీన్‌ను మంగళవారం తహసీల్దార్ కిరణ్మాయి ఎతుట బైండోవర్ చేసినట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. రౌడీ షీటర్‌ను పోలీస్‌స్టేషన్‌కు పలిచి కౌన్సిలింగ్ చేసిన మంచి నడవాడిక కలిగినట్టు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మోర్తాడ్, సెప్టెంబరు10: మండల కేంద్రంలోని మొండివాగులో ఇటీవల భారీ వర్షానికి పని చనిపోయిన వ్యవసాయ కూలీ కాయచోరీ సురేష్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేసింది. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై సురేష్‌లు మృతుని భార్యకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయడానికి సహకరించిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌రెడ్డికి, రెవెన్యూ సిబ్బందికి, పోలీసుఅధికారులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయాలని మహిళ నిరసన

బాన్సువాడ, సెప్టెంబరు 10 : అక్రమంగా తమ భూమిని పట్టా చేసుకుని మోసం చేసిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఓ మహిళ తన పిల్లలు, భర్తతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. అదే విధంగా సోమవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కూడా మహిళ కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తంచేశారు. జుక్కల్ మండలం కౌలాస్ గ్రామానికి చెందిన పూజ తన తల్లిదండ్రులకు చెందిన భూమిని ఓ వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకున్నాడని, అధికారులు చుట్టూ తిరిగిన న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ భూమి తమకు ఇప్పించాలంటూ ఆమె అధికారులను కోరారు. లేనియెడల తమ భూమి తమకు వచ్చేంత వరకు ఆమరణ దీక్షచేపడతామని ఆమె హెచ్చరించారు.

మూడు మెడికల్ షాపులకు నోటీసులు

లింగంపేట,సెప్టెంబరు 11: లింగంపేట మండల కేంద్రంలోని మూడు మెడికల్ దుకాణాలను నాలుగు రోజుల పాటు మూసివేయాలని ఆదేశాలు జారి చేస్తూ డీఐ రాజరెడ్డి నోటీసులు జారి చేశారు. ఒక మెడికల్ దుకాణంలో నిర్వహకులు మెడికల్ దుకాణం ఒకరిపై నిర్వాహణ మరొకరు చేస్తున్నారని పేరు మార్చుకోవాలని నోటీసు ఇచ్చినా స్పందించక పోవడంతో నాలుగు రోజులు మూసి వేయాలని నోటీసులు ఇచ్చారు. మరో రెండు మెడికల్స్‌లలో రోగులకు ఇస్తున్న మందులు ఏ వైద్యుడు సిఫార్సు చేశాడో తెలియజేస్తూ బిల్లులు రాసిపెట్టల్సి ఉండగా నిబంధనలు పాటించిన మరో రెండు మెడకల్ దుకాణాలను మూసి వేయాలని నోటీసులు ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. మెడికల్ దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆయన కోరారు.

ఎస్సీ బాలికల గురుకులాన్ని లింగంపేటకు తరలించాలి

లింగంపేట, సెప్టెంబరు11:మండలానికి చెందిన ఎస్సీ బాలికల గురుకులాన్ని కామారెడ్డిలో నిర్వహిస్తున్నారని దానిని వెంటనే లింగంపేటకు తరలించాలని కోరుతూ ఎస్సీఎస్టీ కమిషన్ వెంకయ్య, విద్యార్థిమోర్చా రాష్ట్రకార్యదర్శి విఠల్‌లు బుధవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కామారెడ్డిలోని దేవునిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయంలో సరియైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు తెలియజేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్నందున విద్యార్థులు స్నానాలు చేయలేకపోతున్నారని సమస్యల కారణంగా విద్యార్థినిలు మానసిక వేదనకు గురవుతున్నారని తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన

డిచ్‌పల్లి, సెప్టెంబరు 10: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కాలనీలో మంగళవారం పౌష్టికాహారం గురించి ఆరోగ్య, అంగన్‌వాడి సిబ్బంది చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు కథలు, చిత్రాల రూపంలో వివరించారు. విద్యార్థులకు కథల రూపంలో పోషన్ అభియన్ నిర్వహించడం వల్ల ప్రీ స్కూల్‌పై అవగాహన ఏర్పాడుతుందని, వివరించారు.

వినాయక మండపాల వద్ద భక్తుల సందడి



నగరంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిగాల



జక్రాన్‌పల్లిలో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: తెలంగాణలో అతిపెద్ద భారీ మట్టి వినాయకుడిని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలన్నారు. ప్రతి యేటా రవితేజా యూత్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. భారీ మట్టి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న రవితేజ యూత్ అధ్యక్షులు నీలగిరిరాజు, యూత్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పరాజు, సత్యప్రకాష్, దండు శేఖర్, రవితేజ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలో గణపతి మండపాల వద్ద గణపతి హోమం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.మంగళవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి,పెర్కిట్,ఆర్మూర్‌ల్లోని పలు గణేష్ మండపాల వద్ద సామూహిక గణపతిహోమం,పూజలు నిర్వహించి భక్తులకుఅన్నదానం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ మండపాల్లో వినా యకులకు భక్తులు, సభ్యులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చు కున్నారు.మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద అన్నదానం నిర్వహించగా అధికసంఖ్యలో పాల్గొన్నారు.వినాయకచవితి సందర్భంగా ఎస్సైగ్రామాల్లో పర్య టించి గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని మండ పాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

రెంజల్: మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఎస్ఐ సాయన్న, ఎంపీవో రఫీ అహ్మద్‌లు సందర్శించారు. గణేష్ నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు చేసి నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కరెంట్ స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లను అమర్చాలని ఎప్పటికప్పుడు ఇక్కడి పరిసరాల కేంద్రాలను ఎరిశీలించి నిఘా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి భాస్కర్, పుష్కర ఘాట్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాములు, సిరాజ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ:మండలంలోని అన్ని గ్రామాలలో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వహలకుతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి డీజేల అనుమతి లేదన్నారు. నిమజ్జనం ఒక్కరోజులోనే ముగించాలన్నారు. పోలీసులసహకరించి పండగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, శ్రీధర్, పీసీలు కిరణ్, చంద్రకాంత్, సంజీవరావ్, రమేష్ స్వామి, లింగం, వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ మండలం దూప్య తండాలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద సంబరాలు చేసుకుంటున్నారు. మహిళలు,యువకులు నృత్యాలు చేస్తూ భక్తులను ఆనంద పరుస్తున్నారు. రాత్రి వేళలో ఆటపాటలతో సంబరాలను అంబరాన్ని అంటే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలను జరుపుకుంటున్నారు. గిరిజన మహిళలు తమ సాంప్రదాయ పద్ధతిలో డ్యాన్సులు చేస్తూ పాటలు పాడుతూ వినాయకులను చూడడానికి వస్తున్న భక్తులను ఆనంద పరుస్తున్నారు.

'చేనేత కార్మికులకు రూ.30కోట్ల రుణమాఫీ'

మోర్తాడ్,సెప్టెంబరు10: రాష్ట్ర సీఎంరేవంత్‌రెడ్డి చేనేత కార్మికులకు రూ.30 కోట్ల రుణాలను మాఫీ ప్రకటించిందని ఆర్మూర్ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు అంబల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేం ద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ కల్పించడం హర్షనీయమన్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన చేనేత కార్మికుల దినోత్సవంలో ఆయన రుణమాఫీ ప్రకటించారని అన్నారు. అంతేగాక వివిధ పథకాల ద్వారా చేనేత కార్మికు లకు బకాయి ఉన్న రూ.290కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల తరపున సీఎం రేవంత్ రెడ్డికి, రుణమాఫీకి సహకరించిన మంత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెల 12న ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ ఎంపికలు గురువారం నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గంగామోహన్, పింజ సురేందర్‌లు తెలిపారు. ఈ ఎంపికలు ఆర్మూర్ పట్టణంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 1-1-2009 నుంచి 1-1-2011 మధ్యన జన్మించిన వారు అర్హులన్నారు.ఉదయం 10గంటలవరకు మైదానానికి చేరుకోవాలన్నారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదీలలో హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు సంఘం కోశాధికారి గట్టడి రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండ్ర అంజుకు సంప్రదించాలని కోరారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



కోటగిరిలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

కోటగిరి,సెప్టెంబరు 10: భారీ వర్షాలకు వరదల్లో నష్టపోయిన ఆంధ్ర, తెలంగాణ ప్రజలను ఆదుకునేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు, పలు వ్యాపార సంస్థల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో వరద వల్ల తీవ్ర ప్రాణ, ఆస్తినష్టం జరిగి ప్రజలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు విరాళాలు సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజయ్య, భూమన్న, రాజేశ్వరి, లింగం, రజిని, సాయాగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 10: నగరంలోని డి-1 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడిఈ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. డి-1 సెక్షన్ పరిధిలోని బురుడుగల్లి, బడాబజార్, గురుద్వార్, గాజుల్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రి జూపల్లిని కలిసిన మోస్రా మండల నాయకులు



మంత్రిని కలిసిన నాయకులు

మోస్రా,సెప్టెంబరు 10: బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డితో కలిసి మోస్రా మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిజామాబాద్ జిల్లా మంత్రి జూపల్లిని కలిసి మండలంలో ఉన్న స్థానిక సమస్యలపై వివరించామని అదే విధంగా రాబోవు స్థానిక సంస్థల ఎలక్షన్ బీఆర్ఎస్ నుండి వచ్చిన వాళ్లకు కాకుండా గతంలో నుంచి పార్టీలో ఉండి పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించాలని నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని కోరడం జరిగిందని బీసీ సెల్ మండల అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జి నారాయణ, ఇంతియాజ్, మోస్రా గ్రామ మాజీ అధ్యక్షుడు సైనాపురం నర్సారెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులున్నారు.

గణేష్ నిమజ్జనంలో ప్రమాదాలు జరుగొద్దు



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నందిపేట, సెప్టెంబరు10: జిల్లాలో జరిగే గణేష్ నిమజ్జన శోభయాత్రలో ఏటువంటి ప్రమాదాలు జరుగ కుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు.మంగళవారం మండలంలోని ఉమ్మెడ శివారులో గోదావరి నది బ్రిడ్జిపై గణేష్ ని మజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను, విద్యుత్ లైన్లను తొలగించాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని కలెక్టర్ సూచించారు. అంతే కాకుండా నిమజ్జన వద్ద సీసీ కెమెరాలు, పోకస్ లైట్లు, క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆయా శాఖల అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో డీపీవో తరుణ్ కుమార్, ఎంపిడీవో శ్రీనివాస్ రావు, తహశీల్దార్ ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు.

యూనివర్సిటీ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు



ఆర్మూర్‌లో క్రీడాకారిణిలను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు10: ఏషియన్ యూనివర్సిటీ మహిళల సాఫ్ట్ బాల్ పోటీలకు భారత జట్టుకు జిల్లా క్రీడాకారులు గుగులోత్ మమత, అజ్మీర ఇందు, లాకవత్ రాణిలు ఎంపికైనట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మర్కంటి గంగామోహన్‌లు తెలిపారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలో జరిగిన ఓకార్యక్రమంలో భారత యూనివర్సిటీకి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారిణిలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దంలింగారెడ్డి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సాఫ్ట్‌బాల్ మహిళ యూనివర్సిటీ జట్టుకు జిల్లా క్రీడా కారిణిలు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. భవిష్యత్‌లో ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనేలా జిల్లా క్రీడాకారులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయమా ఉపాధ్యాయ సంఘం ప్రధానకార్యదర్శి మల్లేష్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు మర్కంటి సుజాత, నవీన్, కోచ్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల వసతి గృహాల తనిఖీ

లింగంపేట, సెప్టెంబరు 11 : లింగంపేట మండలంలోని ప్రభుత్వ ఆసు పత్రిని, మైనారిటీ గురుకులం, మైనారిటి కళాశాలను, వసతి గృహాలను మంగళవారం డీఆర్‌డీవో పీడీ మండల ప్రత్యేక అధికారి సురెందర్ తనిఖీ చేశారు. మైనారిటి గురుకులంలో వంటకు ఉపయోగించే కాయగూరలు, ఇతర వంట సమాగ్రి బాగులేవని వాటిని పారవేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీవో మాలహరి ఉన్నారు.


జీవాలకు పరుడు వ్యాధి నివారణ టీకాలు

దోమకొండ, సెప్టెంబరు 10:మండలంలోని అంచనూర్ గ్రామంలో మంగళవారం జీవాలకు పరుడు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శివ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 మేకలకు ఉచితంగా పశుసంవర్ధక శాఖ నుంచి వచ్చిన టీకాలను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న సీట్లకు 12న తక్షణ ప్రవేశాలు

డిచ్‌పల్లి, సెప్టెంబరు 10: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీలు గా ఉన్న సీట్ల భర్తీ కి అర్హులైన ఎస్సీ విద్యార్థులకు ఈ నెల 12న ధర్మారం గురుకుల పాఠశాలలో తక్షన ప్రవేశాలు కల్పించబడుతాయని జోనల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులు మాత్రమే ధరఖాస్తులు చేసుకోవాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వారి తల్లిదండ్రుల ఆదాయం 2లక్షలు మించవద్దని, ఈ నెల 12న ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ధరఖాస్తులు చేసుకోవాలని జోనల్ ఆఫీసర్ కోరారు. ధరఖాస్తు పారంతో పాటు కుల, ఆదాయ, బోనాఫైడ్, మెమో, జత చేయలన్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



ట్రాక్టర్‌ను సీజ్ చేసిన దృశ్యం

సిరికొండ, సెప్టెంబరు 10: తూంపల్లి సెక్షన్ పరిధిలోని గుడిలింగాపూర్ బీట్‌లో అటవీ భూమిని చదును చేస్తుండగా అధికారులు వెళ్లి పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సిరికొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 492 కంపార్ట్‌మెంట్ భూమిలో అక్రమంగా అటవీ భూమిని కబ్జా చేసుకొని చదును చేస్తుండగా అందని సమాచారం మేరకు సెక్షన్ అధికారి కృష్ణ, బీట్ అధికారులు నాగేష్, హరీష్, బేస్ క్యాంప్ సిబ్బంది గోపాల్ తదితరులు వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. భూమిని చదును చేస్తున్న నింధితులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సెక్షన్ అధికారి కృష్ణ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో వైస్‌చైర్మన్



బైరి లక్ష్మణ్‌ను పార్టీ కండువ వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు10: నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సమక్షంలో మంగళవారం బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో వైస్ చైర్మన్ బైరిలక్ష్మణ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం బైరీ లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్‌చైర్మన్ ఎం.సాయిరెడ్డి, బ్రహ్మణ్‌పల్లి సింగిల్ విండో చైర్మన్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మునిపల్లి మాజీసర్పంచ్ ఎం.చిన్నసాయిరెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు జె.గంగారాం, స్వామి, సాయిరెడ్డి, వంశీ, వినోద్, రాజు, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు

'క్రీడల వల్ల మనోధైర్యం కలుగుతుంది'



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, సెప్టెంబరు10: క్రీడలు అనేవి కేవలం శారీరక ధరుఢ్యాంతో పాటు జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినప్పుడు వాటిని తట్టుకొని నిర్భరంగా, మనోధైర్యంగా ఉండడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలో పాత ఉమ్మడి బాల్కొండ, ముప్కాల్, మెండోర మండలాల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లా డుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజం, అన్నింటిని సమానంగా తీసుకోవాలి, అప్పుడే స్పోర్టింగ్ స్పిరిట్ విద్యార్థుల్లో అలవాడుతుంది. పిల్లలు చదువుతోనే కాకుండా క్రీడల్లో కూడా ఎదగడానికి ప్రొత్సహం కల్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ క్రీడా పోటీలు రాష్ట్ర స్థాయి పోటీల లాగా గొప్పగా ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త దయానంద్‌రెడ్డి, ఎం ఈవో బట్టు రాజేశ్వర్; బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీన్ రెడ్డి,భూమేశ్వర్, నాగంపేట్ శేఖర్, వ్యాయమ ఉపాధ్యాయులు రాజ్ కుమార్, మల్లేష్, పీఈటీలు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన జడ్పీహెచ్ఎస్ ప్రహరీ

మోపాల్, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మోపాల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీ కూలిపోయిన పట్టించుకునే వారు కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రహరీ కూలిపోవడంతో పాములు, విషపురుగులు పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయని విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారని అన్నారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల కూడా ఇందులోనే కొనసాగుతుందన్నారు.కూలిపోయిన ప్రహరీను వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

రుణమాఫీ కాని వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ

వేల్పూర్, సెప్టెంబరు10: మండలంపడిగెల, పోచంపల్లి గ్రామాలలో రుణమాఫీ రాని సుమారు 300మంది రైతుల నుంచి దరఖాస్తులను మంగళవారం ఏవోశృతి స్వీకరించారు. ఆయాగ్రామాలలో రైతు బ్యాంకులో రుణం ఉండి రేషన్‌కార్డు లేని వారికి, రుణమాఫీ రాని వారికి ఏవో శృతి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వోలు శ్యామ్, షబ్బీర్, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఒకరికి తీవ్ర గాయాలు

డిచ్‌పల్లి,సెప్టెంబరు 10 జక్రాన్‌పల్లి మండలం పడకల్ నుంచి బైకుపై రంగు నారాయణ గౌడ్ సుద్దపల్లి కి వస్తుండగా మెంట్రాజ్‌పల్లి గ్రామ శివారులో ఆర్మూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ బైకును ఢీకొనడంతో బైకుపై ఉన్న నర్సుబాయి తలకు బలమైన గా యలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళ వారం సాయంత్రం మృతి చెందిందని ఎస్సై షరీఫ్ తెలిపారు, నారా యణ గౌడ్‌కు బలమైన గాయలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పోం దుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.మృతురాలి భర్తభోజన్న ఫిర్యాదు మేర కు శవాన్ని పంచనామాచేసి పోస్టుమార్టంకు తరలించమనిఎస్సై తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు10: పట్టణంలోని యానంగుట్ట సమీపంలోని మహరాష్ట్రకు చెందిన బాలుప్రకాష్ బోదిలే (40) చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగేళ్ల క్రితం మృతుడు బాలు మహరాష్ట్ర నుంచి బతుకు దెరువు కోసం ఆర్మూర్‌కు వచ్చి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్య పిల్లలకు దూరంగా ఉండడంతో తాగుడికి బానిసైన బాలు ప్రకాష్ బోదిలే మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి జయ భాయ్ ఫిర్యాదు మేరకు ఎఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మున్సిపల్ పరిధిలో పలు దుకాణాల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు10: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌తో పాటు పట్టణంలో మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని స్వీట్ హోం, బేకరీ, పాల దుకాణాలతో పాటు తినుబండరాల దుకాణాలను తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించని దుకాణాల యాజమానులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది ప్రశాంత్; అక్షయ్, రాము, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను గ్రామాల్లో వార్డుల వారీగా త్వరితగతిన పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్

భీమ్‌గల్‌రూరల్, సెప్టెంబరు10: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అన్ని గ్రామాల్లో ఓటరు జాబితాను ఎటువంటి తప్పులు లేకుండా వార్డుల వారీగా త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని సుదర్శన్ నగర్‌తాండా అలాగే పురాణిపేట్ గ్రామాల్లో ఆయన ఆకస్మిక పర్యాటన చేశారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని, అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ మహమ్మద్‌షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్; ఎంపీవో జావిద్; పాషా, ఏపీవో నర్సయ్య, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

జాన్కంపేట్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్, సెప్టెంబరు10: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. గ్రామానికి సంబంధించి ఐదు గురికి చికిత్స కోసం మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి తాగు నీరు వృథా


బీర్కూర్‌లో వృథాగా పోతున్న నీరు

బీర్కూర్, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో నాలుగు పలకల ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అయితే విస్తరణ పనుల్లో భాగంగా మంగళ వారం డోజర్ సహాయంతో రోడ్డు చదును పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్ వాల్‌ను డోజర్ ఢీకొట్టడంతో పైప్‌లైన్ ఎయిర్ వాల్ పగిలిపోయింది. పైప్‌లైన్ నుంచి ఒక్కసారిగా పది పదిహేను ఫీట్ల ఎత్తు వరకు తాగునీరు ఎగిసి పడ్డాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైపులైన్ గుండా తాగునీరు వృథా పోయింది. నీటి ప్రెషర్ తగ్గడంతో దానికదే ఆగిపోయింది. స్థానికులు ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్థానికంగా ఉండటం లేదని, సొంత పనుల్లో నిమగ్నం అవుతున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. సమస్యలు తలెత్తినప్పుడు సమాచారమిచ్చినా అధికారులు స్పందించడం లేదని ఉన్నతాధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మద్నూర్ మండల ప్రత్యేక అధికారిగా డీఎల్‌పీవో

మద్నూర్, సెప్టెంబరు 10: మద్నూర్ మండలం ప్రత్యేక అధికారిగా బాన్సువాడ డివిజన్ డీల్‌పీవో నాగరాజును ప్రభుత్వం నియమించింది. మంగళవారం మద్నూర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల అధికారులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని అన్నారు. అన్ని శాఖల అధికారులు శాఖ పరిధిలో జరుగుతున్న పనుల వివరాలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసి ఉంచాలని అన్నారు.


పంటలను పరిశీలిస్తున్న అధికారులు

తిర్మన్‌పల్లిలో పంటల పరిశీలన

సదాశివనగర్, సెప్టెంబరు 10: మండలంలో వ్యవసాయ అధికారితో పాటు విస్తీర్ణ అధికారులు పంటల పరిశీలన చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తూ వాటికి సోకే తెగుళ్ల నివారణ కోసం పలు సూచనలు చేశారు. ఏవో తిర్మన్‌పల్లిలో, మర్కల్‌లో ఏఈవో శ్రీనివాస్‌నాయక్, లింగంపల్లిలో గాయత్రి, తుక్కోజీవాడిలో శ్రీలక్ష్మీ, సదాశివనగర్‌లో కవిత, యాచారంలో ప్రణీత, అడ్లూర్ ఎల్లారెడ్డిలో కళ్యాణి క్షేత్రస్థాయిలో వెళ్లి పంటలను పరిశీలించారు. ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు పత్తిలో వేరు కుళ్లు తెగులు, కాండం కుళ్లిపోయి మొక్క ఎండిపోవడం జరుగుతుందని దీని నివారణకు మైక్రో న్యూట్రియన్స్ కాపర్ ఆక్సిక్లోరైడ్ ద్రావణం మొదలు తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు పంటలలో నిల్వ ఉన్న నీటిని బయటకు వదిలే విధంగా కాలువలు ఏర్పాటు చేసుకుని పంటలను రక్షించుకోవాలని అన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

మాచారెడ్డి ,సెప్టెంబరు 10: క్రీడల్లో గెలుపోటములు సహజమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పల్వంచ ఉన్నత పాఠశాలలో 34వ సబ్ జూనియర్ బాలబాలికల కోకో టోర్నమెంటు విజేతలకు బహుమతులు అందించి మాట్లాడారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పొందుతామన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 38 బాలుర జట్లు 22 బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో టీజీఎంఆర్‌జీఎస్ జీఎస్ మొదటి బహుమతి, టీజీఆర్ఎస్ మద్నూర్ రెండో బహుమతి టీజీఎస్ డబ్ల్యుఆర్ఎస్ ఎల్లారెడ్డి మూడో బహుమతి గెలుచుకున్నాయి. బాలికల విభాగంలో జడ్పీహెచ్ఎస్ రాంపూర్ మొదటి బహుమతి, సదాశివనగర్ జడ్పీహెచ్ఎస్ రెండో బహుమతి, షెట్పల్లి గురుకుల పాఠశాలల బాలికలు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు భూమారెడ్డి, ప్రధాన కార్యదర్శి అతికుల్లా, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ రాధ, పాఠశాల టోర్నమెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మాణ పనుల పరిశీలన

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 10: మండలంలోని కాటేపల్లి తండాలో మంగళవారం మురికి కాలువ నిర్మాణ పనులను ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి పరిశీలించారు. తండాలో ఎంపీపీ నిధులు గతంలో 2 లక్షల రూపాయలు మంజూరు కాగా, పనులను ఇటీవలే ప్రారంభించారు. పనులను పరిశీలించిన అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ మురికికాలువ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. అంతేగాక మురికి కాలువ నిర్మాణం సమయంలో స్థలం కోసం తండాకు చెందిన వ్యక్తులు గొడవ పడి పనులు ఆపి వేయడంతో వారికి సర్ది చెప్పి పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ, తండా వాసులు పాల్గొన్నారు.

పోరాటాలకు ప్రేరణ ఐలమ్మ

మద్నూర్, సెప్టెంబరు 10: ఐలమ్మ పేరే ఒక ఉద్యమం, ప్రజా పోరాటానికి స్ఫూర్తి అనేక పోరాటాలకు ప్రేరణగా నిలిచిన ఐలమ్మ తెలంగాణ తల్లిగా కీర్తినందుకుంది. నిజాం హయాంలో నియంతృత్వ పాలనపై తిరుగుబాటు చేసి భూ పోరాటాన్ని నిర్వహించిన విరోచిత మహిళ అని కొనియాడారు. వక్తలు ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు దేవిదాస్ మాట్లాడుతూ ఐలమ్మ పుట్టింది చాకలి కులంలో కులవృత్తి చేసుకుని దొరలకు వెట్టి చాకిరి చేసి బతికే కుటుంబాల్లో ఐలమ్మ కుటుంబం ఒకటి. ఐలమ్మ ప్రస్తుత వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో కిష్టాపురంలో జన్మించింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి ఐలమ్మ కోడలుగా వచ్చిందని ఆమె భూమి కోసం భుక్తి కోసం పోరు చేసిందన్నారు. బంధూకు చేత పట్టి దొరల గుండెల్లో సింహం అయిందని గుర్తు చేశారు. పోరుబాటలో అందరినీ పోగొట్టుకున్న ఆమె అందరికీ తల్లిగా మారిందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారిగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐలమ్మ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నడుం కట్టి పోరాడిన మహావీర వనిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలో రజక సంఘం నాయకులు ఘన నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బాలయ్య, రాంచంద్ర, సాయిలు, సుధాకర్, ప్రవీణ్, సందీప్, బాలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డు చౌరస్తా వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. ఆమె చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, తాటిపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రజక సంఘం సభ్యులు ఐల్లమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సాయిబాబా, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సావిత్రి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ ప్రమీళ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ పుష్ప, ఉపాధ్యాయురాలు దేవిక, అనురాధ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ సాయిబాబా సిబ్బందితో కలిసి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు.


మద్నూర్‌లో చాకలి ఐలమ్మ వర్ధంతిలో పాల్గొన్న రజకులు

బాన్సువాడ టౌన్: పట్టణంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులు వైస్ చైర్మెన్ షేక్ జుబేర్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన వీరవనిత ఐలమ్మ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సాయిలు, మహేశ్, శివ, సూరి, రాము దత్తు, నిఖిల్‌గౌడ్, విజయ్, రాఘవ తదితరులున్నారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మకు నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట పటిమను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ సహకార సంఘం చైర్మన్ శివానంద్, నాయకులు వినోద్, దాదారావ్ పాటిల్, రాములు సేట్. రాజుల సేట్, రాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డిలో మున్సిపల్ చైర్‌పర్సన్


బాన్సువాడలో..


దోమకొండలో..


జుక్కల్‌లో..


మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు


.. బస్వరాజ్ పటేల్

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన జిల్లా నాయకులు

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 10: నూతనంగా నియామకమైన టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తికి టీపీసీసీ చీఫ్ పోస్టును అందించడంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

బీర్కూర్: ఇటీవల నూతనంగా ఎన్నికైన రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మంగళవారం బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బస్వరాజ్ పటేల్ మహేష్ కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పోషక ఆహారంతో మానసిక ఎదుగుదల

సీడీపీవో కళావతి


మద్నూర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

మద్నూర్, సెప్టెంబరు 10:పోషక ఆహారంతో మానసిక ఎదుగుదలతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మద్నూర్ ప్రాజెక్టు సీడీపీవో కళావతి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు పోషక అభియాన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ఆట పాటలతో పాటు చదువులో నిమగ్నమవుతారు. ముఖ్యంగా వారి ఎదుగుదలకు ఇదే సమయంలో పౌష్టికాహారం అందించినట్లయితే మానసికంగా ఎదుగుతారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 1 నుంచి 30 వరకు పోషక అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించింద న్నారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక అభియాన్‌పై సమావేశాలు నిర్వహించి బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కవిత, వినోద, వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలి

• కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 10: జిల్లాలోని మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో మైనర్, మేజర్ మరమ్మతులుంటే గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వసతి గృహాల సంక్షేమ అధికారులు క్షేత్రస్థాయిలో వసతి గృహాలను సందర్శించి కావాల్సిన మరమ్మతులను గుర్తించాలని తెలిపారు. స్లాబ్‌రిపేర్, పైప్‌లైన్, లీకేజీ, మరుగుదొడ్ల మరమ్మతుల వంటి వాటిని గుర్తించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాలని తెలిపారు. వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని అన్నారు. ప్రతీ వసతి గృహంలో వైద్యపరీక్షలు చేయించాలని తెలిపారు. వైరల్ జ్వరాలు ఉంటే రక్తపరీక్షలు చేయించాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఈవో రాజు, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారిని రజిత, ఇన్‌చార్జ్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, వివిధ గురుకుల పాఠశాలల ఆర్‌సీఓలు, ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



రామారెడ్డి, సెప్టెంబరు 10: కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి సింధూర పూజలు నిర్వహించారు. స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవునికి పాలాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజ కార్యక్రమాలను అంగరంగవైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభు రాంచంద్రం గుప్తా, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ శోభాయాత్రకు రోడ్ల పరిశీలన

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 10: పట్టణ కేంద్రంలో గణేష్ శోభాయాత్ర నిర్వహణకు వీధుల్లో ఉన్న రోడ్లను అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ శోభాయాత్రకు రోడ్ల పక్కన విద్యుత్ స్తంభాలు గాని ఏమైనా ఇరుకుగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి తహసీల్దార్ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, మహేందర్, సీఐ రవీందర్ నాయక్, ఎస్సై మహేష్, విద్యుత్ ఏఈ సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భగలాముఖి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 10 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీలో ఆర్టీసీ బస్ డిపో పక్కన కొలువై ఉన్న భగలాముఖి అమ్మవారి రెండో వార్షికోత్సవం ఉంటుందని మంగళవారం ఒక ప్రకటనలో పీఠం నిర్వాహకులు ప్రముఖ జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తెలిపారు.

మోడెగాం చేరిన దళిత వికాస సమితి పాదయాత్ర


మోడెగాంలో మాట్లాడుతున్న దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ

సదాశివనగర్, సెప్టెంబరు 10: ఎస్సీ రిజర్వేన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టంలో చేయాలని ఈనెల 1న ఆదిలాబాద్‌లో ప్రారంభమైన దళిత వికాస సమితి పాదయాత్ర మంగళవారం మండలంలోని మోడెగాంకు చేరుకుంది. ఈ సందర్భంగా దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలు చేయకపోవడంతో నిరుపేద దళితులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గత 70 సంవత్సరాలుగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అమలవుతున్న ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా లబ్ధిపొందిన 3 శాతం మంది దళితులు నేడు సంపన్నవర్గంగా అవతరించారని అన్నారు. వీరే ఎస్సీ రిజర్వేషన్లలో గుత్తాధిపత్యం వహిస్తుండడంతో నిరుపేద దళితులు వీరి కుటుంబాలతో పోటీ పడలేకపోతున్నారు. బీసీలలో 6 లక్షల ఆదాయం మించితే ఓసీలలో 8 లక్షల ఆదాయం మించితే క్రిమిలేయర్ అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్‌లో అమలు చేయకపోవడంతో పేద దళితులకు ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లింగం, మండల నాయకుడు గంగాధర్, భాస్కర్, నర్సింలు, రాజయ్య, బాలయ్య, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో రాహుల్ గాంధీకి స్వాగతం పలికిన ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి, సెప్టెంబరు 10: అమెరికాలోని డల్లాస్‌లో జరుగుతున్న ఓ కార్యక్రమంలో మంగళవారం పాల్గొనేందుకు వెళ్లిన జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద స్వాగతం పలికి పుష్పగుచ్ఛాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అందజేశారు. అనంతరం రాహుల్ గాంధీతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపు


హుండిని లెక్కిస్తున్న దృశ్యం

భిక్కనూరు, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం అసిస్టెంట్ కమిషనర్ విజయరామారావు సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల హుండీని లెక్కించగా రూ.6,80,683 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కాగా అసిస్టెంట్ కమిషనర్‌ను ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవో పద్మశ్రీధర్, సిబ్బంది అర్చకులు పాల్గొన్నారు.


ఘన్‌పూర్‌లో కుక్క దాడిలో 10 మందికి గాయాలు

మాచారెడ్డి, సెప్టెంబరు 10: మండలంలోని ఘన్‌పూర్(ఎం)లో పిచ్చి కుక్క దాడిలో సోమవారం 10 మందికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కళావతి అనే మహిళ కిరాణషాపునకు వెళ్తుండగా ఆమెపై దాడి చేసింది. అక్షిత అనే బాలిక బయటకు వెళ్లగా ఆమెపైన దాడికి పాల్పడింది. ఇలా దాదాపు మరో 8 మందిపై దాడి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

భిక్కనూరు, సెప్టెంబరు 10: మండలంలోని బాగిర్థిపల్లి గ్రామం లో ఆస్తి తగదాలతో మంద లావణ్యను హత్య చేసిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఈనెల 6న భూ తగాదాలతో మంద లావణ్య అలియాస్ ఏనుమణిని అతికిరాతకంగా ఆమె మరిది సురేష్ అలియస్ యాకుబ్ హత్య చేశాడని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
శాంతి	సరిపోదా శనివారం	మహేశ్వరి	సరిపోదా శనివారం
దర్శన్	ది గ్రేడెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్	వెంకటేశ్వర	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్
ప్రియా 35	35 (2024)		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

